కాఫీ బ్రేక్ స్టోరీ

“‘ఏమండీ! అత్తయ్యగారు కనబడ్డం లేదండీ!” చీర చెంగుతో నుదుట పట్టిన స్వేదబిందువులను అద్దుకుంటూ, కన్నుల్లో కమ్ముకుంటున్న కన్నీటిని దాచటానికి ప్రయత్నిస్తూ, దారి తెలియని రెండేండ్ల కుర్రాడు దారి తప్పిపోయినట్లుగా గాభరా పడిపోతోంది భారతి.

భారతి మాటలకు ఏ మాత్రం గాభరా పడకుండా కాసేపు నింపాదిగా కాఫీ త్రాగినా, భార్య మరీ కంగారుగా అటు ఇటు తెగతిరుగుతూ హైరానా పడుతుంటే, తానూ కాస్త కంగారు పడసాగాడు కిషోర్.


కొంగు నోటికడ్డం పెట్టుకుని గొల్లు మంటున్న భార్యను ఊరడించబోయాడు కిషోర్.

భర్త వైపు కోపంగా చూస్తూ, ముక్కుపైకి ఎగబీలుస్తూ “ఇంతా మీ వల్లనే! ఆవిడ మనసుకు కష్టం కలిగించింది మీరు. ఇప్పుడు ఇరుగు పొరుగు మన ముఖాన కళ్లాపి చల్లుతారు” అంది భారతి.

ఇరుగుపొరుగు అనగానే తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకునే ఎదురింటి గోపాలం. తల్లి అడుగులకు మడుగులొత్తే పొరుగింటి విఠల్ గుర్తుకొచ్చారు కిషోర్‌కు. వాళ్లిద్దరి తల్లులు పుట్టింది, మెట్టింది పల్లెటూళ్ళలో! అయినా పల్లెటూళ్ళు వదిలి, కొడుకుల వెంట చక్కగా పట్నాని కొచ్చి అటు పుల్ల ఇటు పెట్టకుండా, కాలు కదపనక్కరలేకుండా, కోడళ్లు అన్ని అమర్చి పెడుతుంటే, పలకలపై కొత్తరకం ముగ్గులు గీసుకుంటూ, ఈ మధ్యనే నేర్చుకున్న వైరు బుట్టలు అల్లుకుంటూ, ఒకరింటికి ఒకరు వెళ్తూ, వస్తూ కులాసాగా కాలం వెళ్ళబుచ్చేస్తుంటారు.

# అత్తగారి సామ్రాజ్యం

శ్రీ. ఉమాదేవి




‘నిజంగా నీళ్ళు, పల్లెలను మరిచారా లేక పట్నం వీరిలో ఇంత మార్పు తెచ్చిందా’ అని ఆశ్చర్యపోతుంటాడు కిషోర్. తాను తన భార్య, పిల్లలు ఏదో ఇంత తిని, మరి కొంత టిఫిన్ బాక్సులలో కుక్కేసుకుని పరుగులు తీయాలి బస్టాపుకు. తామిద్దరు ఉద్యోగులే. నింగి నంటే ధరలను ఉద్యోగమనే నిచ్చెన ద్వారా అందుకోవాలని భారతి కూడా ఇటు గృహిణిగా. అటు ఉద్యోగినిగా ద్విపాత్రాభినయం చేయక తప్పడం లేదు. అందుకే భారతంటే కిషోర్ తల్లి రుక్మిణమ్మకు వల్లమాలిన ప్రేమ, అభిమానం. కడుపున బిడ్డ కాక పోయినా తమ ఇంట అడుగిడి, పూసలలోని దారంలా తమతో కలివిడిగా కలిసిపోయిన భారతిని చూస్తే అత్తగా కించిత్ గర్వపడేది. బహుశ ఉద్యోగం చేస్తూ, ఆర్థిక వెసలుబాటు కలిగిస్తున్నందుకు కోడలంటే ఒకింత సానుభూతి. నేటి స్త్రీలంతా భర్తలటు ఉద్యోగాలకు వెళ్లగానే, షాపింగులకు, సినిమాలకు వెళ్తుంటే, సాయంత్రం అరయే సరికి చెమటలు కక్కుకుంటూ వచ్చి, తలనొప్పిని, విసుగును పక్కనెట్టి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని వంటింట్లోకి ప్రవేశించే కోడలిని చూస్తే ఎక్కడలేని జాలి వేసేది రుక్మిణమ్మకు.

బొగ్గుల కుంపటి ఎంత సేపటికి రాజుకోక, కిరోసిన్ స్టవ్ ఎంతకు నీలి మంట రాక పాత్రలు మసిబారుతుంటే, మసకబారిన మధ్య తరగతి బతుకులకు అద్దం పట్టినట్లుండేది. అందుకే భారతి రాకమునుపే బొగ్గులకుంపటి వసారాలోకి చేర్చి, నిప్పు రాజేసి, నెమ్మదిగా అవి, ఇవి అందుకుంటూ వంట చేసేసేది రుక్మిణమ్మ.

కిషోర్ ఇంటికి రాగానే చిరకింత మసే కాక చేతులకు, ముఖానికి కూడా అంతో ఇంతో పూసుకుని, కాఫీ గ్లాసు పట్టు కొచ్చేది రుక్మిణమ్మ. విశ్రాంతి తీసుకోమంటే తన మాట పెడచెవిని పెట్టి ఇలా తమ కోసం కష్టపడడం కోసమా పల్లెలో వున్న భూమి. ఇల్లు అమ్మేసి తల్లి నిక్కడకు బలవంతంగా తీసుకొచ్చింది’ అని కిషోర్ బాధపడేవాడు. తల్లికి కష్టం కలిగించకని భారతిని ఒకటి రెండుసార్లు హెచ్చరించాక కాఫీ ప్రొద్దుటే ఫ్లాస్కులోపోసి పెట్టెయ్య సాగింది. ప్రొద్దుట కాఫీ, టిఫన్లయే

సరికే బొగ్గులకుంపటి, స్టవ్ అలసినట్లు ఆరి పోతాయి. ఎంత ఫ్లాస్క్ అయితే మాత్రం వేడిగా తాగాలను కున్న కాఫీ సాయంత్రానికి వెచ్చగా వుంటుందంతే. కాఫీ త్వరత్వరగా, వేడి వేడిగా ఇవ్వలేని తన నిస్సహాయతను వెళ్ళ బుచ్చేది. భారతి.

భార్యా భర్త లిద్దరు కలిసి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. కాని వారి ఆలోచన ఫలించడానికి మరో ఆర్నెల్లు పట్టింది. దాని ఫలితమే మిల మిల మెరిసే స్టీల్ గ్యాస్ స్టవ్! అయితే ఆ లోపలే ఎదురింటి గోపాలం అడ గనే అడిగాడు కిషోర్‌ను.

"ఏమోయ్! కొత్త వంట వచ్చిన పనిమనిషిని చూడరాదూ.... మీ అమ్మగారి కీవయసులో ఇబ్బందెందుకు?" అంటూ.

చివరకు స్నేహితుడు కూడా తానేదో తల్లి పట్ల నిర్దయగా ప్రవర్తిస్తున్నట్లు నీతి బోధ చేసే సరికి కిషోర్ తనలో తనే బాధపడి మెల్లగా తల్లికి నచ్చ చెప్పసాగాడు. వంటపని తగ్గించు కోవాలని.



'క్రీస్తు జననం'

చిత్రం: పి. నారాయణరావు, తెనాలి

ఓ శుభముహూర్తంలో కొత్త గ్యాస్ స్టవ్ మీద పాలు పొంగించి వంటకు శ్రీకారం చుట్టింది భారతి. కాఫీ నిముషంలో తయా రుచేసి, ఇచ్చిన కోడలి వైపు. అందు కాధార మైన గ్యాస్ స్టవ్‌ను, పెద్ద ఎర్రటి బానలాంటి సిలండరును ఆశ్చర్యంగా చూస్తుండి పోయింది రుక్మిణమ్మ. యుద్ధంలో గాయపడ్డ సైనికునిలా కిరోసిన్ స్టవ్, బొగ్గులన్ని బూడిద చేసుకుని బొగ్గుల కుంపటి వసారాలో ఓ మూలనబడి బిక్కు బిక్కు మంటున్నాయి. వాటిని నీలి నాలుకలతో వెక్కిరిస్తున్నట్లుగా నీలి మంట లను ప్రజ్వరిల్లుతోంది గ్యాస్ స్టవ్! దానిపై ఎలా వండాలో తెలియని రుక్మిణమ్మ వంటిం ట్లోనే మాట, పలుకులేక బిగుసుకు పోయి చూస్తోంది. ఆవిర్లు కక్కుతూ విజిల్ వేస్తున్న రైస్ కుక్కర్‌ను, పాము పిల్లలా బుస్, బుస్ మంటున్న ప్రెజర్ కుక్కర్‌ను!

ఆ రోజు వంట త్వరగా చేసేయ గలిగింది భారతి. కారణం రైస్ కుక్కర్ ప్రెజర్ కుక్కర్ కూడా జంట కవుల్లా గ్యాస్ స్టవ్‌ను అనుసరించి గృహ ప్రవేశం చేయడమే. ఒక ప్రక్క రైస్ కుక్కర్, మరో ప్రక్క ప్రెజర్ కుక్కర్, టిఫిన్ తిని స్నానం చేసి వచ్చే సరికి తమ కర్తవ్యం పూర్తి చేసి 'మీల్స్ రెడీ' అంటాయి. ఇకనేం! కావలసినంత టైమ్ దొరికింది. నింపా




దిగా బాబుకు స్నానం చేయించి, పాపకు ఒపిగ్గా జడలల్లి శుభ్రంగా బడికి పంపగలిగింది భారతి. రుక్మిణమ్మకు చేయడానికి పనిలేక చేతులు కట్టేసినట్లున్నాయి.

ఒక వారం రోజులపాటు కోడలు వండుతున్న పద్ధతిని గ్రహించే ప్రయత్నం చేయసాగింది. ఎలా? ఏమిటి? అని అడిగి తెలుసుకోవాలంటే మొహమాటంగానే వుంది ఆవిడకు. కొడుకు, కోడలు ఆఫీసుల నుండి, పిల్లలు బడి నుండి వచ్చేవరకు ఎడతెరిపి లేని తీరిక. పల్లెటూళ్లలో వంటపనేకాక, అంతో ఇంతో పంటపని కూడా చేసిన రుక్మిణమ్మకు చేతులు ముడుచుకుని కూర్చోవడం శిక్షగా అనిపించ సాగింది. అలా అనిపించడమేమిటి. ఇలా వంట గదిలోకి ప్రవేశించి గ్యాస్ స్టవ్‌ను కోడలు వెలిగించే పద్ధతిని జ్ఞాపకం చేసుకుని అగ్గిపుల్ల గీచి వెలిగించింది. స్టవ్ 'హై'లో వెలుగుతోంది. నాబ్‌ను కుడి వైపుకు త్రిప్పింది. అయితే కాస్త పూర్తిగా! అంతే స్టవ్ ఆరిపోయింది. పొరపాటుకు నొచ్చుకుంటూ గబుక్కున ఎడమ వైపుకు త్రిప్పింది, కాస్త సన్నని మంటయినా వస్తుందేమోనని. ఊహు... మంట ఎక్కడిదాకా తగ్గిపోయిందో అర్థంకాక కంగారు పడసాగింది రుక్మిణమ్మ. గ్యాస్ సన్నగా లీక్ కాసాగింది. ఆ వాసనకు కడుపులో తిప్పినట్లయి, కిటికీని మరింత బోర్లా తెరచి, కొడుకు తలుపు తట్టి పిలిచి నట్లయితే వెళ్లి తలుపు తీసింది. గ్యాస్ వాసన వచ్చిరానట్లుగా వుంది. గాభరా పడుతూ వంట ఇంటివరకు పరుగెట్టి, గ్యాస్ లీక్ గమనించి గబగబా సిలిండర్ వాల్వ్ మూసి బయటకు పరుగెట్టాడు కిషోర్.

"నీకెందుకొచ్చిన బాధమ్మా ఇది? చేతకాని పనులతో అవస్థ ఎందుకు? హాయిగా రామకృష్ణా అని కూర్చోక" అసలే సిగ్గు పడుతూ నిలుచున్న తల్లిని విసుక్కున్నాడు కిషోర్.

"అది కాదురా అబ్బాయ్! నీకు కాఫీ చేద్దామని వెలిగించాను. బాగానే వెలిగింది మొదట్లో. అటు, ఇటు తగ్గింపులు, హెచ్చింపులు చేసే సరికి అలసినట్లు ఆగిపోయింది. పైగా తలతిరి గేంత వాసన. డోకొచ్చిందనుకో, అయినా స్టవ్ మంచిది కాదేమోరా" సందిగ్ధంగా అంది రుక్మిణమ్మ.

"సరేలే స్టవ్ మంచిది కాదట. నీకు ఈ స్టవ్‌పై వండటం చేతకాక వంటపనికి పోకుండా వూరుకుంటావేమోనని మా ప్రయత్నం.

**చిట్కాలు**

మంచి గుమ్మడి కాయ రసాన్ని తీసు కొంటే ప్రొస్టేటు గ్రంథి బాధలన్నీ నయ మవుతాయి. మూత్రము సాఫీగా అవుతుంది.

\- కె. విజయ

నువ్వేమో అందరి దగ్గర అక్షింతలు వేయిస్తున్నావు మాకు"

రుక్మిణమ్మ కొడుకు మాటలకు తెల్లబోయింది.

అందరి దగ్గర తను కొడుక్కి అక్షింతలు వేయిస్తోందా? పెద్దరికం కలుక్కుమంది. కొడుకంత పెద్దగా అరుస్తూ ఎందుకు విసుక్కున్నాడో తాను చేసిన తప్పేమిటో అర్థం కాలేదు రుక్మిణమ్మకు.

కిషోర్ మాటల వలన చూచాయిగా విషయం బోధపడినా ఏమి తెలియనట్లు అప్పుడే వచ్చిన భారతి కాఫీ చేసి అత్తగారికి, భర్తకు ఇచ్చి తనూ ఓ గ్లాసందుకుంది.

రుక్మిణమ్మ గతం తవ్వుకుంటోంది ఆ రాత్రి. ఇంటికి పెద్ద కోడలిగా తాను అడుగిడిన రోజుల్లో వంటపని అంతా తనదే. తనకు వంటిల్లే సామ్రాజ్యం. చిన్న స్పూను మొదలు, అట్లకాడదాకా అన్నీ తన చేతులలోనే నాట్యమాడేవి. కాలాలు మారు తున్నా తన కాలమంతా వంటింట్లోనే గడిపింది. ప్రతిఫలంగా, అన్నపూర్ణ, దొడ్డ ఇల్లాలు అని ఖర్చులేని బిరుదులు కూడా అందుకుంది. అయినా ఈ కొత్త కొత్త స్టవ్‌లు వచ్చి తనను అజ్ఞానిని చేసాయన్నదే ఆమె బాధ. భారతి కూడా ఆ రాత్రి కలత నిదురలోనే గడిపింది. తాను అత్తగారికి స్టవ్ గురించి వివరించి వుంటే కిషోర్ అలా విసుక్కుని ఆమె మనసు నొప్పించకపోవు నేమోనని, ఈ ఫ్లాష్ బ్యాక్ తదనంతర సంఘటనే రుక్మిణమ్మ కనిపించకపోవడం!

కిషోర్ పోలీస్ కంప్లయింటు ఇవ్వాలను కున్నాడు. కాని భారతి వారించింది. ఇంకా ఇరుగుపొరుగునడిగి తరువాత పోలీసుల దాకా వెళ్దామంది. గోపాలం భార్య ఆదుర్దా కనబరు స్తూనే, అనుమానం వ్యక్తం చేసింది. 'ఒకవేళ మహిళా మండలికేమైనా వెళ్లుంటుందేమో'నని.

"అయ్యో! ఆవిడ కలాంటివి అలవాటు లేదండి" అని భారతి తల అడ్డంగా వూపింది.

"లేదండీ, మీరు పొరబడుతున్నారు. మహిళా మండలిలో కుకింగ్ క్లాసులు జరుగు తున్నాయి. రకరకాల వంటలు నేర్పుతున్నారు అని అంటే, 'చూస్తే బావుందునే తల్లీ' అని అన్నారు కూడా! మీ కంటే ఉద్యోగం తొందరలో ఇలాంటివి తెలియవు. మాలాంటి వారికంతా తీరుబాటేగా! అసలు నిన్ననే అంటు ఒడిరి అత్తయ్యగారు,

"మీలా చిన్నవయసు కాకపోయె అటు ఇటు తిరగడానికి, లేకపోతే మేము నేర్చు కుందుము కేకులు, బిస్కట్లు" అంటూ.

ఆ మాట వినడం ఆలస్యం గబగబా పరు గెత్తింది భారతి దగ్గరలోని మహిళా మండలి వైపు.

అక్కడ... కులాసాగా అటు ఇటు తిరుగుతూ అందరికి సలహాలందిస్తున్న రుక్మిణమ్మ కోడలిని చూడగానే, కాస్త కలవర పడినా, పెద్దరికంతో కలవరపాటును కప్పి పుచ్చుకుని,

"రా భారతీ! వీళ్ల పేణీలు చేయడం నేర్పమంటేనూ, అయినా అలా వచ్చావేం వగరుస్తూ? అబ్బాయి ఆఫీసుకు బయలు దేరాడా, పిల్లలు బడికి వెళ్లిపోయారా? ఇదిగో అమ్మాయిలూ మళ్లీ రేపొస్తాను, పేణీలకు పాకం చల్లారాక పోయండి. ఆ.. అన్నట్టు ఈ స్టవ్ హై నుండి సిమ్‌లో పెట్టండి. లేకపోతే పేణీలు మాడిపోతాయి. పద పద వస్తున్నాను". అంటూ ఏమీ జరగనట్లే మైదా పూరీలు వత్తుతున్న అత్తగార్ని చూస్తుంటే 'వంటిల్లే సామ్రాజ్యం' అని ఆవిడ ఎందుకు భావించిందో భారతికి అర్థం కాసాగింది. ఆరేండ్ల కుర్రాడు అర నిమిషంలో టి.వి.ని ఆపరేట్ చెయ్యడం నేర్చుకుంటున్న ఈ రోజుల్లో అత్తగారికి వంట కష్టము తప్పిద్దామని స్టవ్ గురించి చెప్పకపోవడం ఒక విధంగా తన తప్పేననుకుని, ఇంటికి చేరగానే

"నన్ను క్షమించడత్తయ్యా" అని రుక్మిణమ్మ చేతులు పట్టుకుంది.

"చూడు భారతీ! ఏ పనైనా అయిష్టతతో చేస్తే భారం. కాని ఇష్టంతో చేస్తే అదే ఓ కళ! అలాంటిదే నా వంట ఆసక్తి కూడాను! ఇప్పుడు కొత్త స్టవ్ గురించి నాకు దిగుల్లేదు. అయితే ఒకరి మాటలు పట్టించుకోవద్దని అబ్బాయితో చెప్పు" అని కొడుకు, కోడలి వంక చిరునవ్వుతో చూసింది. అంతే! ఆ తరువాత అత్తగారి సామ్రాజ్యంలో భారతి ఓ ప్రేక్షకురాలు మాత్రమే!